Brot für die Welt

# సంపూర్ణ మిశ్రమ ఆహార పంట

## రోగ నిరోధక శక్తి పెంచుకొనుటకు సేంద్రీయ మిశ్రమ ఆహార పంట విధానము (కోవిడ్ పంట)

యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటరు
ప్రకృతి • మానవత • సుస్థిరత

కరోనా వ్యాధిని ఎదుర్కోవాలంటే రోగ నిరోధక శక్తి అత్యవసరమని నిపుణులు తెల్పుచున్నారు. కొర్రలు, జొన్నలు, సద్దలు వంటి చిరుధాన్యాలు, కంది, అలసంద, అనుములు, పెసలు, ఉలవలు వంటి పప్పుధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు మొదలైనవి ఎక్కువగా ఆహారంలో తీసుకుంటేనే మనలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ పంటలన్నింటిని మనము మన వర్షాధార భూములలో సేంద్రీయ పద్ధతిలో మిశ్రమ పంటగా పండించుకోవచ్చును. ఈ విధంగా మిశ్రమ పంటలు వేయటము, పంట మార్పిడి చేయడము మనకు కొత్తేమి కాదు. ఈ పంటలన్నిటిని గతములో మన పెద్దలు రసాయనాలు వాడకుండా సేంద్రీయ పద్ధతిలో మెట్టభూములలో పండించి తినేవారు. అందుకే వారు చాలా బలంగా ఆరోగ్యంగా ఉండేవారు.

కరోనా లాంటి వ్యాధులను ఎదుర్కొనే రోగ నిరోధక శక్తి మనకు రావాలనే ఉద్దేశ్యముతో సేంద్రీయ మిశ్రమ పంట పద్ధతిని ఒక కార్యక్రమంగా ప్రవేశ పెడుతున్నాము. ఈ మిశ్రమ పంటలో 13-20 రకాలైన చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, కూరగాయలు, ఆకు కూరలు వుంటాయి. కనీసం ఇంటి వాడుకకు సంపూర్ణ ఆహారానికి అవసరమయ్యే వాటిని ఈ పద్ధతిలో పండించుకుంటే ఇంటిలోని అందరికీ సంపూర్ణ ఆహారము లభ్యమై రోగ నిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యంగా ఉండవచ్చును. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు, గుండె జబ్బులు, ఉబ్బస రోగము, రక్తపోటు, చక్కర వ్యాధులు వున్నటువంటి వారికి సంపూర్ణ ఆహారము మరింత అవసరమవుతుంది.

ఈ సంవత్సరము మన సస్యమిత్ర సంఘాలలో ప్రతి రైతు కూడా కనీసము అర ఎకరా నుండి ఒక ఎకరము వరకు వర్షాధార భూమిలో ఇంటి ఆహార అవసరాల కోసము ఈ మిశ్రమ పంటలు సేంద్రీయ / ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించాలని కోరుచున్నాను. మన కుటుంబములో అందరికీ రోగ నిరోధక శక్తి పెంచుకొనుటకు అవసరమైన పోషకాహారము చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు మనమే మన భూమిలో పండించుకుందాము. అలాగే తక్కువ పెట్టుబడితో స్థానికవనరులు వాడుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి రసాయనాలు వాడకుండా ఈ పంటను పండించుకుందాము. దీని కొరకు ఎ.ఎఫ్. సంస్థ మీకు అవసరమైన విత్తనము, సాంకేతిక సహకారము మొదలైనవి అందుబాటులో ఉంచి సహకరిస్తుంది.

**సస్యమిత్ర సంఘాలలో ఉన్న ప్రతి రైతు కుటుంబము ఈ సంవత్సరము పాటించవలసినవి :**

1. కనీసము ఒక అర ఎకరము నుండి ఎకరము భూమిలో చిరుధాన్యాలు ఈ కోవిడ్ పంటను పండించవలయును.
2. భూమి లేనివారు, పంట పెట్టనివారు ప్రతి ఇంటిలో పెరటి తోటలో కూరగాయలను ఆకు కూరలను పండించుకోవలయును.
3. ఈ కార్యక్రమాన్ని అమలు చేయుటకు ముఖ్యంగా మన గ్రూపులలోని ఒంటరి స్త్రీలకు, వికలాంగులకు వలసపోయి తిరిగి వచ్చినవారికి అధిక ప్రాధాన్యత ఇవ్వవలయును.

**ఈ 'వర్షాధార భూములలో ప్రకృతి వ్యవసాయము' కార్యక్రమము వలన లాభాలు :**

1. ప్రకృతి (సేంద్రియ) వ్యవసాయము వలన ఖర్చులు తగ్గుతాయి.
2. మిశ్రమ పంట విధానము వలన వర్షాలు సరిగా పడక కొన్ని పంటలు పోయినా మిగిలిన పంటలు పండుతాయి.
3. రక్షక తడి వంటి పద్ధతుల ద్వారా కరువు నుండి పంటలను కాపాడుకోవచ్చును.
4. కుటుంబములో అందరికి సమతుల పోషకాహారము లభించి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
5. ఇంటికి అవసరమైన తిండి గింజలు మహిళల ఆధీనంలో వుంటాయి.
6. రైతు కుటుంబానికి ఆహార భద్రత, పౌష్టికాహార భద్రత ఏర్పడుతుంది.
7. ఇంటి ఆహార ఖర్చులు తగ్గుతాయి.
8. పశువులకు, పక్షులకు తగిన మేత దొరుకుతుంది. మేత ఖర్చు తగ్గుతుంది.
9. పశువులు, జీవాల నుండి ఆదాయము పెరుగుతుంది.
10. పొలములో పచ్చదనము పెరిగి భూసారము భూమి ఉత్పాదన పెరుగుతుంది.

**అమలు చేయు విధానము :**

ఈ కార్యక్రమాన్ని 8 మండలములలోని, 30 గ్రామములో గల 800 సస్యమిత్ర గ్రూపుల ద్వారా అమలు జరుగును. కనీసము ఒక 10,000 కుటుంబాలు తమ పొలములో, ఇంకో 10,000 కుటుంబాలు పెరటి తోట ద్వారా సంపూర్ణ పోషక ఆహారము పండించుకొని ఇంటిలో వినియోగించాలి. ఈ కార్యక్రమాల అమలులో సస్యమిత్ర గ్రూపులు, గ్రామ సస్యమిత్ర గ్రూపులు, మండల సస్యమిత్ర గ్రూపులు, మండల మాక్స్‌లు తమతమ స్థాయిలలో వివిధ పనులు చేపడతాయి మరియు పర్యవేక్షణ చేస్తాయి.

## సస్యమిత్ర గ్రూపుల పాత్ర :

ప్రతి సస్యమిత్ర గ్రూపులో 5-6 ఉపగ్రూపులు ఉన్నాయి. ఈ కార్యక్రమమును గురించి ప్రతి సస్యమిత్ర గ్రూపు సమావేశములో చర్చించాలి. కోవిడ్ రోగాన్ని ఎదుర్కొనుటలో పౌష్టిక ఆహార ప్రాముఖ్యత మరియు ఆ ఆహారమును మనమే పండించుకోవాల్సిన అవసరము గురించి చర్చించాలి. ప్రతి సభ్యునకు కరపత్రము ఇచ్చి వారి కుటుంబములో ఈ పంట గురించి చర్చచేయమని చెప్పాలి. కార్యక్రమ అమలు గురించి ఉపగ్రూపులలో ప్లాన్ చేయాలి.

ప్రతి కుటుంబము తమ పొలములో కానీ ఇంటి పెరటిలో కాని ఇంటి వినియోగానికి అవసరమైన పౌష్టిక ఆహారమును పండించుకునేలా ఉప గ్రూపుల వారిగా ఉమ్మడి ప్లాను చేయాలి. ప్రతి యస్.యమ్.జిగ్రూపుకు మిశ్రమ ఆహారపంట 12-15 వివిధ నమూనా కిట్లు ప్రదర్శన క్షేత్రాలకి ఇవ్వడానికి అవకాశం వుంది. ఈ నమూనా ఎవరు పొలములో పండిస్తారు, ఎంత విస్తీర్ణములో పండిస్తారు మరియు ఎవరు పెరటి తోటలో పండిస్తారు. పెరటి తోట విస్తీర్ణము ఎంత అన్న వివరాలు సేకరించాలి.

ఈ కార్యక్రమానికి అమలు చేయుటకు ముఖ్యంగా గ్రూపులలోని ఒంటరి స్త్రీలకు, వికలాంగులకు వలస పోయి తిరిగి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వవలయును. ఈ కార్యక్రమ అమలు సక్రమంగా జరుగుటకు ఉపగ్రూపుల లీడర్‌లకు ప్రధాన బాధ్యత ఇవ్వవలెను.

## జి.ఎస్.ఎం.ఎస్ బాధ్యతలు :

1. ప్రతి సస్యమిత్ర గ్రూపు యందు ఈ నమూనాల పైన చర్చలు చేసి విధి విధానాలను తెలియజేసి రైతులను ఎన్నికచేసే బాధ్యత ఉపగ్రూపు లీడర్లు తీసుకోవాలి. యస్.యమ్.జి.లో ఎంపిక ప్రక్రియ మినిట్స్ నందు నమోదు కావాలి.
2. ఎంపిక అయిన రైతులు నమూనా ప్రకారం విత్తుకొనేటట్లు ప్రోత్సహిస్తూ మరియు పర్యవేక్షణ చేయాలి.
3. అమలు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు కాని, అడ్డంకులు వచ్చిన వారి స్థాయిలోనే సామరస్యంగా పరిష్కరించుకోవాలి.
4. మన విత్తనము దుర్వినియోగం కాకుండా పర్యవేక్షించుకోవాలి.
5. గ్రామస్థాయిలో ప్రజలందరికీ కార్యక్రమము గురించి అవగాహన పెంచాలి.
6. అన్ని సస్యమిత్ర గ్రూపులకు కార్యక్రమ అమలులో సహకారము అందించాలి.

## ఎం.ఎస్.ఎం.ఎస్ బాధ్యతలు :

1. మండల స్థాయిలో కార్యక్రమ అమలు పర్యవేక్షణ చేయాలి, అవసరమైన సహకారము అందించాలి.
2. విత్తనము కొనుగోలు మరియు సరఫరాలో మండల మాక్స్ కి తోడ్పాటుని అందించాలి.

## ఎస్.టి.ఓ. బాధ్యతలు :

1. ప్రతి సభ్యుడు / సభ్యురాలు విత్తనము కిట్ కొనేలా చూడాలి.
2. నమూనా ప్రకారము మిశ్రమ పంటలు విత్తుకునేలా ఉపగ్రూపు లీడర్లతో కలసి పర్యవేక్షణ చేయాలి.
3. అలాగే పంట పెట్టనివారు పెరటి తోట పెట్టుకొనేలా చూడాలి.
4. ఎప్పటికప్పుడు పంటల గురించి, వాటి వినియోగము గురించి గ్రూపులలో చర్చ చేయాలి.
5. ఎంపిక చేసిన రైతులకు డైరీ నిర్వహించాలి. సేద్యము మొదలు పెట్టినప్పటి నుంచి పంటలు ఒడుపుకునేవరకు పూర్తి వివరాలు అందులో వ్రాయాలి.
6. ప్రతి క్లస్టర్‌లో 250 మంది కుటుంబాల సభ్యుల నమూనాల ప్రకారం పౌష్టిక ఆహారము పండించడము మరియు 250 మంది కుటుంబాలకు పెరటి తోటల ద్వారా పెట్టించడం యస్.టి.వో టార్గెట్.

ఇట్లు,

మీ శ్రేయోభిలాషి,

**డా॥ వై.వి. మల్లారెడ్డి,**

డైరెక్టరు

**యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటరు**

**ఉప్పరపల్లి రోడ్డు, బెంగళూరు హైవే,**

**అనంతపురము - 515 002 ఆం.ప్ర.**